andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 । కనిష్ఠం 25.8
నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 23 ఆగస్టు 2024





అటకెక్కిన జలవిహార్ ప్రతిపాదన

గత ప్రభుత్వ హయాంలో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు వద్ద జలవిహార్ గురించి పరిశీలిస్తున్న రాష్ట్ర స్థాయి అధికారులు(ఫైల్)

- నిర్లక్ష్యంలో నది తీర ప్రాంతాల అభివృద్ధి
- జిల్లాలో భక్తులకు అందని బోటు షికారు
- కొత్త సర్కారుపైనే ఆశలు

నిర్మల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ బాసర సరస్వతీ దేవి సందర్శించేందుకు వచ్చే యాత్రికులను ఆకట్టుకునేందు కోసం ఎస్సారెస్పీ బాసర బోటు జల విహారం ప్రాజెక్టు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. కరోనా కల్లలం తగ్గకా రాష్ట్రంలోని వివిధ నది తీర ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నౌకవిహార ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఇందులో భాగంగానే కొన్ని నది తీర ప్రాంతాల్లో బోటు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నప్పటికీ బాసర వద్ద మాత్రం ఇప్పటి వరకు ఈ బోటు విహార సౌకర్యాన్ని యాత్రికులకు కల్పించలేకపోతున్నారు. బాసర సరస్వతీదేవిని దర్శించుకునేందుకు ప్రతీరోజూ మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారంతో పాటు పండుగ పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకునేందు కోసం భక్తులు బారులు తీరుతారు. ఇక్కడ భక్తులకు వసతి సౌకర్యం ఉండడంతో ఒక రోజు గడిపి మరుసటి రోజున అమ్మవారి మొక్కులను తీర్చుకుంటారు. అమ్మవారి దర్శనం అనంతరం వీరంతా గోదావరిలో బోటు షికారు చేసే సౌకర్యం కల్పిస్తే ఇటు టూరిజంశాఖకు ఆదాయ పరంగా అలాగే భక్తులకు ఆహ్లాదకరంగా ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

బాసర నుంచి ఎస్సారెస్పీ ప్రాజెక్టు రిజర్వాయర్ వరకు బోటు నడపాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం శంకుస్థాపనకు అప్పట్లో పోచంపాడ్ వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. పథకం పూర్తయితే కాళేశ్వరం జలాలతో ఎస్సారెస్పీ నిండాక బాసర.. ఎస్సారెస్పీ ప్రాజెక్టు మధ్య పడవల్లో ప్రయాణించవచ్చని ఆయన అప్పట్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి, పర్యాటకశాఖ అధికారులు ఇక్కడ బోటు విహారంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 2019 సంవత్సరంలో కసరత్తు ప్రారంభించి ట్రయల్‌రన్‌ను కూడా ప్రయోగాత్మకంగా చేపట్టారు. సర్వీసులు కూడా ప్రారంభిస్తామని పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా దృష్టి సారించకపోవడం పట్ల యాత్రికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు నిరాశ..

బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మరింద ఆహ్లాదం, మధురానుభూతిని పొందేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు సహకారం అయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎస్సారెస్పీని చేరుకొని అక్కడి నుంచి బాసరకు, బాసర నుంచి తిరిగి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పడవల ద్వారా ప్రయాణించే అవకాశం లభిస్తుంది. ఎస్సారెస్పీని ఆనుకొని ఉన్న నిజామాబాద్ జిల్లాలోని బస్సాపూర్, నాగాపూర్ గ్రామాల దగ్గర బోటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి బాసర వరకు పడవలను నడపాలని గతంలో అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు సీరియస్‌గా యాక్షన్ మొదలుకాలేదు. ఇది పూర్తయితే పర్యాటక రంగం అభివృద్ధి చెంది జిల్లాలోని యువకులకు ఉపాధి లభించేది. బాసరకు వస్తే ఇంకా చూడటానికి ఇకేం ఉన్నాయి అన్న భక్తుల ప్రజలకు సరైనా జవాబు రావడంలేదు. ఈ ప్రాంత వాసులకు.

అవకాశాలు అనేకం..

పర్యాటకశాఖ, దేవాదాయశాఖలు సంయుక్తంగా ప్రాజెక్టుపై సీరియస్‌గా కార్యాచరణ మొదలుపెట్టాలని సూచిస్తున్నారు. గోదావరిలో బోటు ప్రయాణాలు ఆరంభిస్తే ఎస్సారెస్పీ నుంచి బాసర, బాసర నుంచి ఎస్సారెస్పీ వరకు రెండున్నర గంటల వ్యవధిలో గమ్యం చేరుకోవచ్చని అంటున్నారు. సుమారు 60 కిలోమీటర్ల మేరకు ఈ ప్రయాణం సాగుతుందని మధ్యలో బ్రహ్మేశ్వరం ఆలయం సందర్శన, ఉమ్మెడ తదితర పర్యాటక ప్రాంతాల వద్ద బోటును నిలిపిన గంటల్లో బాసరకు చేరువచ్చని అంటున్నారు. వేసవి మినహా మిగతా ఎనిమిది నెలల పాటు పడవలను నడిపే అవకాశం పుష్కలంగా ఉందని అంటున్నారు.

కొత్త సర్కారుపైనే ఆశలు

ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ బాసర గోదావరి జలవిహారం ప్రాజెక్టు ప్రతిపాదనలను కాగితాలకే పరిమితం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలకు మోక్షం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. యాత్రికులకు ఆహ్లాదం కల్పించేందు కోసమే కాకుండా టూరిజంశాఖ ఆర్థికంగా కూడా ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంతో నైనా జలవిహారం ప్రాజెక్టుకు రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి పడి

ప్రయాణికులకు తీవ్ర గాయాలు



పెచ్చులూడిన బస్టాండ్ స్లాబ్.. తీవ్రంగా గాయపడ్డ శ్రీలత



స్లాబ్ నుంచి ఊడి పడిన పెచ్చుల కుప్ప

భైంసా, ఆగస్టు 22 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా బస్టాండ్ స్లాబ్ పెచ్చులూడి కిందపడటంతో ముగ్గురు ప్రయాణీకులకు తీవ్రగాయాలయ్యాయి. గురువారం ఉదయం బస్టాండ్ స్లాబ్ పెచ్చులూడి కింద పడ్డాయి. ఈ సమయంలో అక్కడ బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీకులపై పెచ్చులు పడటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను హుటాహుటిన వైద్య సేవల నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో నిజామాబాద్ జిల్లా నందిపేట్ ప్రాంతానికి చెందిన శ్రీలత (28), సహస్ర (8), కుభీర్ మండలం బెల్గాం గ్రామానికి చెందిన సంగీత (27) ఉన్నారు. శ్రీలత తలకు గాయాలు తీవ్రంగా ఉండటంతో ఏరియా ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డులో చేర్పించి చికిత్స అందించారు. క్షతగాత్రులను భైంసా డిపో మేనేజర్ హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సెక్యూరిటీ అధికారి భగవంత్‌రావ్‌లు ఏరియా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

ఇసుక డంపులు స్వాధీనం చేసుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వల వద్ద పోలీసులు

భైంసా, ఆగస్టు 22 : పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసి ఉంచిన భారీ ఇసుక డంపులను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. గురువారం టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో టౌన్ ఎస్ఐ ప్రదీప్, ఏఎస్ఐ లింగురామ్‌ల సారథ్యంలో పోలీసు బృందాలు అక్రమ ఇసుక నిల్వలపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్నాయి. నిర్మల్- నాందేడ్ రోడ్డు మార్గం పట్టణ సరిహద్దులోని సీటి కాంటాతోపాటు పరిసర ప్రాంతాల్లో ఇసుక డంపులపై పోలీసు ఆకస్మిక తనిఖీలు చేపట్టి సీజ్ చేశారు. సీటి కాంటా ప్రాంతంలో మహ్మద్ అక్తరోద్దీన్, సయ్యద్ ఫెరోజ్, అబ్దుల్ అఫ్సర్‌లకు చెందిన మూడు ఇసుక డంపులను, జియో పెట్రోల్ బంక్ సమీపంలోని మహమ్మద్ అల్మాస్, అబ్దుల్ అఫ్సర్, సయ్యద్ అఫ్రోజ్, ఖలీల్ ఆహ్మద్‌లకు చెందిన నాలుగు ఇసుక డంపులను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఇదే క్రమంలో పాత ఆర్‌టీవో చెక్‌పోస్టు సమీపంలో తిప్పోల్ల నారాయణకు చెందిన భారీ ఇసుక డంపును కూడా పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. సంబంధిత ఇసుక నిల్వలను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వగా ఉంచిన సదరు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించిన . నిల్వగా ఉంచిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 22 : సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు, రోగులకు అందిస్తున్న వివిధ వైద్య సేవలు, సిబ్బంది విధులు తదితర అంశాలపై వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలతో తల్లి, బిడ్డలకు కలిగే ప్రయోజనాలపై గర్భిణీలకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కాన్పుల కోసం వచ్చే గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన సమాచారం తెలిసే విధంగా సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రుల వారీగా అందుబాటులో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య పరికరాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఒకే దగ్గర గుమిగూడకుండా ఉండేందుకు సరిపడినన్ని కుర్చీలు ఏర్పాటు చేయాలని, టోకెన్ విధానాన్ని అనుసరించాలన్నారు. ఇన్ పేషెంట్ విభాగంలో రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలను నమోదు చేయాలని తెలిపారు. రోజువారీ రిజిస్టర్లు, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యాధికారులు సునీల్, సరోజ, సౌమ్య, సురేష్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రితో తనిఖీ

నర్సాపూర్(జి), ఆగస్టు 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రితో గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్, బయటి రోగుల విభాగం, మందుల గది, టీకాల గదిలో సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సౌకర్యాలు అందిస్తున్న చికిత్సలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్య చికిత్సలను అందించాలని సూచించారు. సీజనల్ వ్యాదులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అసౌకర్యం కలగకుండా అవసరమైన బెడ్స్, మందులు, వైద్య పరికరాలు నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనను కచ్చితంగా పాటించాలని విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సమన్వయం చేసుకుంటూ ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో టీవీని ఏర్పాటు చేసి పౌష్టికాహారం, పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎచ్.ఎన్.డాక్టర్ సౌమ్య, వైద్యులు, సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు భద్రత పటిష్ఠంగా చేపట్టాలి : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 22 : గణేష్ ఉత్సవ వేడుకల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా భద్రత చర్యలు పటిష్టంగా చేపట్టి శాంతియుత వాతావరణంలో జరిగేందుకు పోలీసుశాఖ కృషి చేయాలని ఎస్పీ జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు ముందు నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. భద్రత కోస మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య, రవాణా తదితర శాఖలతో సమావేశం నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలని, సీసీ టీవీలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. మండపాల్లో డీజేలకు అనుమతి ఉండదని కమిటీలకు సూచించాలన్నారు. మండపాల్లో విద్యుదాఘాతం సంభవించకుండా నాణ్యమైన వైర్లు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. మండప కమిటీలు, నిర్వాహకులు, ఇన్‌చార్జీల ఫోన్‌నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మండపం వద్ద తప్పనిసరిగా పాయింట్ బుక్ ఏర్పాటు చేయాలన్నారు. ఘర్షణలు జరుగకుండా నివారించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత పెంచాలని స్పష్టం చేశారు.

ప్రత్యేక పికెట్ల ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. గణేష్ శోభాయాత్రలకు ఆటంకాలు కలుగకుండా పోలీసు సిబ్బంది, స్విమ్మర్లు, నిమజ్జన క్రేన్‌లు, సీసీ కెమెరాల బందోబస్తుపై సంబంధిత అధికారులతో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్త కుండా పర్యవేక్షించాలన్నారు. నిమజ్జనం జరిగే స్థలాల్లో వీధి లైట్లు, ఫ్లడ్ లైట్లు, అవసరమైన క్రేన్‌లు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు నిర్మించాలని, మంచినీరు, మొబైల్ టాయిలెట్లు, వైద్య సదుపాయాలు నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. కలిసికట్టుగా పని చేసి ఉత్సవాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 22 : రాష్ట్రంలోని ఆశావర్కర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశావర్కర్ల జిల్లా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టీఎన్జీవో భవనంలో గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి పి. గంగామణి, జిల్లా గౌరవ అధ్యక్షురాలు బి.సుజాత మాట్లాడుతూ... 15 రోజుల సమ్మె హామీలు నెరవేర్చాలన్నారు. పారితోషకం 18 వేలకు పెంచాలని, ప్రతీనెలా 2న పారితోషకం చెల్లింపు, 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్లు 5 లక్షలు చెల్లించాలని కోరారు. ప్రతీఏటా 20 రోజుల వేతనంతో కూడిన సీఎల్, 6 నెలల వేతనంతో మెడికల్ సెలవులు ఇవ్వాలని, పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు జి. కిషన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశావర్కర్ల సంఘం నాయకులు

దుబాయ్‌లో గుండెపోటుతో

కోతుల్‌గాం వాసి మృతి

భైంసా రూరల్, ఆగస్టు 22 : మండలంలోని కోతుల్‌గాం గ్రామానికి చెందిన సట్ల నర్సయ్య అనారోగ్యంతో దుబాయ్‌లో మృతి చెందాడు. గురువారం కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిసింది. రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన సట్లనర్సయ్య గత కొద్ది రోజుల నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని ఫోన్ ద్వారా కుటుంబీకులకు తెలిసింది. మంగళవారం తాము నివసిస్తున్న రూమ్‌లో హార్ట్ ఎటాక్‌తో మృతి చెందగా అతనితో పాటు రూమ్‌లో ఉన్న వ్యక్తులు కుటుంబీకులకు సమాచారం అందించారు. ప్రభుత్వం స్పందించి మృత దేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు



నిరసనలో పాల్గొన్న శ్రీహరి రావు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 22 : ఏఐసీసీ ఆదేశం మేరకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు పాల్గొన్నారు. అదానీ షేర్ల విలువ కృత్రిమ పెంపు వ్యవహారంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు, సెబీ చైర్మన్ రాజీనామా డిమాండ్‌తో నిరసన కార్యక్రమం కొనసాగిందని శ్రీహరిరావు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు మంత్రులు, ఏఐసీసీ నాయకులు, ఎమ్మెల్యేలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

యోగాపై బాల్యం నుంచే

అవగాహన కల్పించాలి : చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 22 : యోగపై బాల్యం నుండే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. గురువారం అంబేద్కర్ భవనంలో జిల్లా స్థాయి యోగా ఎంపిక పోటీలను జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ... యోగాతో అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం యోగాతో సాధ్యమవుతుందన్నారు. స్పోర్ట్స్ మేనేజర్ శ్రీనివాస్, డాక్టర్ కే. గంగాధర్, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ యూ. కృష్ణంరాజు, పద్మనాభగౌడ్, యోగా అధ్యక్షురాలు అన్నపూర్ణ, డ్యాన్స్ మాస్టర్ ధనరాజ్, పరిశీలకులు టి.బాలశేఖర్, యోగరత్నలు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు

ముధోల్, ఆగస్టు 22 : అబ్దుల్లాపూర్ నుంచి చింతకుంటరోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజా ప్రతి నిధులు, అధికారులకు గతంలో ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో చింతకుంట గ్రామానికి చెందిన ఎస్‌కే బాబా సొంత డబ్బుతో మరమ్మతు చేయించారు.

సంక్షిప్త సమాచారం

కాలువలో పడి రైతు మృతి



కాళేశ్వరం కెనాల్‌లో తేలిన అశోక్ మృతదేహం

దిలావర్‌పూర్, ఆగస్టు 22 : పంట కాపలాకు వెళ్తూ కాలు జారి కాళేశ్వరం కెనాల్‌లో పడి యువ రైతు మృతి చెందిన ఘటన దిలావర్‌పూర్ మండలం కదిలిలో జరిగింది. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... కదిలి గ్రామానికి చెందిన గైక్వాడ్ అశోక్(43) పెసర పంట సాగు చేశాడు. పెసరను అడవిపందులు పాడు చేస్తుండటంతో పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు బుధవారం రాత్రి కాపలాకు వెళ్తుండగా దారిలో ఉన్న బురద వల్ల ప్రమాదవశాత్తు కాలు జారి ప్రక్కనే ఉన్న కాళేశ్వరం కెనాల్‌లో పడిపోయాడు. ఈత రాక మునిగిపోయాడు. చుట్టూ ఎవరూ లేకపోవడంతో పాటు రాత్రి కావడం వల్ల ఎవరూ గమనించలేదు. రాత్రి వెళ్లిన అశోక్ ఉదయం ఇంటికి రాకపోవడంతో తమ్ముడు ప్రకాష్ పంట చేనుకు వెళ్తుండగా మార్గమధ్యలో కాళేశ్వరం కెనాల్‌లో అన్న అశోక్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అశోక్ కొడుకు ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు.

సోన్ గ్రామంలో బీజేపీ రచ్చబండ



రచ్చబండ నిర్వహిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 22 : మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణమాఫీ పొందని రైతుల వివరాలు సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణ మాఫీ వర్తింపజేసేలా బీజేపీ పోరాటం చేస్తుందని నాయకులు తెలిపారు. మార గంగారెడ్డి, హరీష్‌రెడ్డి, మేకల అశోక్, నరేష్, శ్రీనివాస్, అమృత్, నర్సయ్య, గంగాధర్, రాజు, రమణ, వెంకటేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ధర్నా

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 22 : అర్హులైన రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ వర్తింపజేయాలన్న డిమాండ్‌తో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉదయం 10:30 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నా శిబిరానికి బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు హాజరై ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

అక్షరాస్యతపై అవగాహన

తానూర్ , ఆగస్టు 22 : మండల కేంద్రం తానూర్‌లోని సమాఖ్యలో గురువారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం. సువర్ణ, ఉపాధ్యక్షురాలిగా వైశాలి, కార్యదర్శిగా వందన, సహ కార్యదర్శిగా సాగరబాయి, కోశాధికారిగా ప్రతిభను ఎన్నుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

ఉట్నూర్, ఆగస్టు 22 : ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమ్ముగూడ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఉట్నూర్ ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసర్ శిలానంద్ తెలిపారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొమ్ముగూడ వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకొని రేంజ్‌కు తరలించామన్నారు. అడవుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన వెంట ఎఫ్ఎస్ఓ గోపాల్ ఉన్నారన్నారు.

లారీల నుంచి బ్యాటరీలు, డీజిల్ చోరీ

బోథ్, ఆగస్టు 22 : బోథ్ మండల కేంద్రం సమీపంలోని సాయినగర్ కాలనీ సమీపంలో నిలిపి ఉంచిన నాలుగు లారీలలో నుంచి 300 లీటర్ల డీజిల్‌తో పాటు ఆరు బ్యాటరీలు లారీలపై కప్పి ఉంచే పదిహేను వేల రూపాయల విలువైన వస్తువులతోతో పాటు లారీ జాక్‌ను తీసుకువెళ్లారు. దాదాపు లక్ష రూపాయల విలువైన డిజిల్‌సామాగ్రి చోరీ జరగడంతో లారీ యజమానులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేగాక పొచ్చెర ఎక్స్ రోడ్డు సమీపంలో నిలిపి ఉంచిన రెండు రిగ్ బోర్ లారీల నుంచి డీజిల్‌ను తీసుకువెళ్లారు.

ప్రిన్సిపాల్ వేధింపుల నుంచి రక్షించండి

● విద్యార్థుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 22: ప్రిన్సిపాల్ వేధింపుల నుంచి తమను రక్షించండి మహాప్రభో అంటూ 46 మంది విద్యార్థులు తెల్లవారు జామున పాఠశాల గోడ దూకి ఆరుకిలో మీటర్లు కాలి నడకన పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించిన సంఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాభ్యాసం జరుగుతోంది. ఈ పాఠశాలలో 46 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా గత కొంత కాలంగా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కొరత, మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని విద్యార్థులు పదిహేను రోజుల క్రితం, వారం రోజుల క్రితం రెండు సార్లు ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ విషయాన్ని ఏబీవీపీ విద్యార్థులు కలెక్టర్ రాజర్షిషా దృష్టికి తీసుకెళ్లారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత విద్యార్థులను ప్రతిరోజూ వేధింపులకు గురి చేస్తోంది. పాఠశాల సమస్యలను బయటకు చెబుతారా అని విద్యారులపై కక్ష్య కట్టి భోజనాన్ని సరిగా వడ్డించడం లేదని, ఇరుకు గదుల్లోనే ఉంచుతుందని విద్యార్థులు ఆరోపించారు. కాగా ఈ వేధింపులను భరించలేని విద్యార్థులు గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు 46 మంది విద్యార్థులు పాఠశాల గోడదూకి ఆరు కిలోమీటర్లు కాలినడకన ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని పోలీసు స్టేషన్ ఎదుట మూడు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. టూటౌన్ సీఐ కరుణాకర్ విద్యార్థుల వద్దకు చేరుకుని వారి సమస్యలను తెలుసుకుని వారికి అల్పాహారాన్ని అందించారు. అనంతరం జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు సమస్యను వివరించారు. ఎస్పీ కలెక్టర్ రాజర్షిషాకు సమస్యను వివరించారు. ఆర్డీవోతో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వగా విద్యార్థులు ఆందోళనను విరమించారు.

రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలి

● నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు ● ప్లకార్డులతో ర్యాలీలు ● బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్‌లతో నినాదాలు



నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త



భైంసాలో ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న బీఆర్ఎస్ ప్రతినిధులు

నిర్మల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేయాలంటూ నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డీసీసీబీ చైర్మన్ కొరిపెల్లి రామ్‌కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. భైంసా ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం పాల్గొని ప్రసంగించారు. అలాగే కుంటాల మండలం అర్లీ ఎక్స్ రోడ్ వద్ద లోకేశ్వరం, కుంటాల మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాం సుందర్ పాల్గొన్నారు. కుభీర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. రైతులందరికీ రుణమాఫీ భర్తీ చేయాలంటూ చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేశారు.

'ఆంక్షలు లేకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలి'

నిర్మల్ అర్బన్, ఆగస్టు 22 : ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సంబంధించి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అనేక ఆంక్షలు విధించి రైతులను మోసం చేశాడని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రామ్‌కిషన్‌రెడ్డి, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ యు. సుభాష్‌రావులు అన్నారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ బాధ్యులు పాల్గొన్నారు. ముందుగా ధర్నా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసిన తీరుకు నిరసనగా ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అధికారంలోకి వచ్చాక 6 గ్యారంటీలను అమలు చేస్తామని 420 హామీలను ఇచ్చిన రేవంత్‌రెడ్డి, ఇచ్చిన హామీలన్నీ బుట్ట దాఖలు చేశారన్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించి రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించడం వల్ల ఎందరో మంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాక బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు.. ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణాలను 100 శాతం మాఫీ చేసే వరకు రైతులతో కలిసి ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు పూదరి నరిహరి, లక్ష్మణ చారి, గంగ్రత్ రమేష్, తదితరులతో పాటు ఆయా మండలాల బాధ్యులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొర్రీలు లేకుండా మాఫీ చేయాలి

భైంసా, ఆగస్టు 22 : ఎలాంటి కొర్రీలు పెట్టకుండా బ్యాంక్‌ల నుంచి రుణాన్ని పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింప చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కర్త విలాస్ గాదేవార్ పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు గురువారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో రుణమాఫీపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల లబ్ధిపొందేందుకు ఎలాంటి నిబంధనలకు తావులేకుండా ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేపడుతామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం అందుకు భిన్నమైన రీతిలో వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసపూరిత విధానాలను అవలంభిస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఇందులో పార్టీ ప్రతినిధులు నంగి రాజేష్, రావుల పోశెట్టి,రావుల నర్సయ్యలతోపాటు పలువురు పాల్గొన్నారు.

'మాఫీ చేసేదాకా ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తాం'

ఖానాపూర్, ఆగస్టు 22 : రైతులందరికీ బేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ మండల శాఖ డిమాండ్ చేసింది. రైతు రుణమాఫీపై తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి నిరసనగా గురువారం బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు రైతు దీక్ష నిర్వహించారు. అనంతరం ఖానాపూర్‌లో ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... పూర్తి స్థాయిలో రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీని చేసే వరకు ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాల్‌సింగ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గౌరీకర్ రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బీసీ రాజన్న, తోట సుమిత్, పెంబి మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, సహా పలువురు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'బేషరతుగా పంట రుణాలు మాఫీ చేయాలి'

ముథోల్, ఆగస్టు 22 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బేషరతుగా రెండు లక్షల రూపాయలు పంట రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన ముథోల్‌లో రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు బండారి గంగాధర్, విఠల్ కాంబ్లే, అశోక్, రైతులు పాల్గొన్నారు.

రైతుల రుణమాఫీ చేయాలని ఆందోళన

కుభీర్, ఆగస్టు 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి వివేకానంద చౌరస్తా వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజక వర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త కిరణ్‌కొమ్రెవార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం రెండు లక్షల వరకు రుణమాఫి వెంటనే మాఫీ చేయాలని అన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం చేరుకొని పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు మోహియోద్దిన్, ఎన్నిల అనీల్, దేవిదాస్, సంజీవ్, సంతోష్, కిరణ్, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

కుంటాల : అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు విధించకుండా రూ.2 లక్షల రుణమాఫీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు కుంటాల మండలం అర్లి ఎక్స్ రోడ్డు వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేప ట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ. 2 లక్షల రుణమాఫీ చేయనందుకు ముథోల్ నియోజకవర్గ రైతుల తరపున ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికి రెండు లక్షల రుణమాఫీని వెంటనే చేపట్టాలని లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వరం మాజీ ఎంపీపీ సాయన్న, కుంటాల మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటవార్ దశరథ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు దత్తు, సొసైటి చైర్మన్ భాస్కర్, మాజీ సర్పంచ్ కిషన్, సోషల్ మీడియా క న్వీనర్ ప్రశాంత్, ఎస్సీసెల్ కన్వీనర్ దిగంబర్, ఎస్టీ సెల్ కన్వీనర్ భోజన్న తోపాటు కుంటాల, లోకేశ్వరం మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పొన్కల్‌లో దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



పొన్కల్‌లో బస్‌పాసులు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మామడ రూరల్, ఆగస్టు 22 : మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదేశానుసారం అర్హులైన దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. ఈ దివ్యాంగుల బస్‌పాస్ పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్ బస్సులలో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, రూ. 50 చెల్లించాలని బస్సు పాస్ ఇన్‌చార్జి టివి. రమణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రాం ప్రసాద్, సిర్గాపూర్ సాయరెడ్డి, కండెల శంకర్, దివ్యాంగులు పాల్గొన్నారు.

.. దరఖాస్తుల స్వీకరణ



మాచాపూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఆగస్టు 22 : మండలంలోని దివ్యాంగులకు తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో గురువారం రాయితీ బస్సు పాసులను పంపిణీ చేశారు. వికలాంగుల సర్టిఫికెట్‌లో ఉన్న అంగవైకల్యం శాతం ఆధారంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల దివ్యాంగుల వద్దకే వచ్చి దరఖాస్తులను స్వీకరించి ఈ పాసులను జారీ చేశారు. మండలం మొత్తం మీద 20 మందికి ఈ పాసులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్సుపాస్ ఇన్‌చార్జి అధికారి రమణ, సిబ్బంది శంకర్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

సిరికొండ, ఆగస్టు 22: మండల కేంద్రంలో గుట్కాను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. రూ.14 వేల విలువైన గుట్కాను పట్టుకున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన అస్లాం అనే వ్యాపారస్తుని నుండి తీసుకువచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

ఆదిలాబాద్‌అర్బన్, ఆగస్టు 21 : జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా హాకీ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మేజర్ ఖేలో ఇండియా హాకీ కేంద్రంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసి ప్రసంగించారు.

గన్‌పార్కు ధర్నాలో పాల్గొన్న కంది శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్ ధర్నాలో కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన్న ధర్నాలో గురువారం ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాని, ప్రధాని ఇద్దరు ఒకటేనని విమర్శించారు. దేశంలో విలువైన సంపదను ఆదానికి కట్టబడెతున్నారని పేర్కొన్నారు. ఆర్థికపరమైన లావాదేవీలలో ఆదాని పై వస్తున్న లక్షల కోట్ల ఆరోపణల పై ఇప్పటి వరకు విచారణ జరుగలేదన్నారు. మోదీ, ఆధాని మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారానిన అడ్డుపెట్టుకుని ఆదానికి లక్షల కోట్లు దోచిపెట్టారని ఆరోపించారు. ఆదాని పై చర్యలు తీసుకొని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటిని వేసి నిజాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో పలుమార్లు ప్రస్తావించిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

పత్తి పంటను పరిశీలించిన
స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు



అడకంటంలో పత్తి పంటను పరిశీలిస్తున్న స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు

జైనథ్, ఆగస్టు 22 : జైనథ్ మండలంలోని అడకంటం గ్రామాలలో పంట పొలాలను గురువారం స్విట్జర్లాండ్ దేశానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇవాన్స్, మదీనాలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగు మందుల తయారికి సంబంధించిన సీన్‌జంటా మందులు కంపెనీకి సంబంధించిన దాంట్లో పత్తి పంటలో తెల్లదోమ నివారణ పై పరిశోధన జరుపుతున్నట్లు శాస్త్రవేత్తలువివరించారు. ఈ కార్యక్రమంలో అడకంటం తాజా మాజీ సర్పంచ్ వైద్య బాలాజి, ఆదర్శ రైతులు కె.రాంరెడ్డి, రషీద్, దినేష్‌విశ్వాస్, సంతోష్, బాదం శ్రీనివాస్‌రెడ్డి, ఉగ్గే గజానంద్‌లు పాల్గొన్నారు.

ఆదివాసులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 22 : ఆదివాసులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అలంకార రాఘవులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

కొనసాగుతున్న జూడాల ఆందోళనలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 22 : వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనను నిరసిస్తూ జూడాలు ప్రారంభించిన ఆందోళనలు తొమ్మిదో రోజుకు చేరాయి. గురువారం రిమ్స్ వైద్య కళాశాల సంచాలకుడి కార్యాలయంలో బైఠాయించి నిరసన ప్రదర్శన కొనసాగించారు. కోల్‌కతా ఘటనలో న్యాయం చేయడంతోపాటు రిమ్స్‌లో వైద్య విద్యార్థులకు పూర్తి భద్రత ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సందీప్ చారి, కారుణ్య పాల్గొన్నారు.

'వేధింపులకు గురి చేయడం మానుకోవాలి'

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 22 : మాదిగ జాతి ఉద్యోగస్తులను మనువాద మతతత్వ పార్టీల కొంత మంది సంఘాల నాయకులు మానసిక వేధింపులకు గురి చేయడం మానుకోవాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ హెచ్చరించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతి బాపూలే (జైనథ్) మావల ప్రిన్సిపల్‌పై అకారణంగా ఎలాంటి ఆధారాలు లేకుండా విద్యార్థులనువేధింపులకు గురి చేస్తున్నదని ఏబీవీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాదిగ జాతి ఉద్యోగస్తులను బ్లాక్ మెయిలింగ్ చేయడం మానుకోవాలని, లేని పక్షంలో మాదిగ సంఘాల తరపున తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కత్తి గంగాధర్ మాదిగ, జిల్లా కార్యదర్శి ముక్కెర మాదిగ, జిల్లా సహాయ కార్యదర్శి కొల్హారు స్వామి మాదిగ, నాయకులు భూమన్న మాదిగ జామ్లే నాందేవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల ధర్నా

● రుణమాఫీ చేపట్టాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి

తలమడుగు, ఆగస్టు 22 :మండల కేంద్రంలో ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేసేలా వారికి బాబా సాహెబ్ అంబేద్కర్ బుద్ధిని కల్పించాలని ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి వినతిపత్రాన్ని రైతులు అందజేశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఇస్తారి రెడ్డి, స్వామిరెడ్డి, మారుతి, ప్రేమేందర్‌రెడ్డి, అఖిల్‌రావు, రాహుల్, భూత దేవన్న, పులి గంగన్న, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మాఫీ చేయాలని కోరితే
కేసులు పెడుతున్నారు

ఉట్నూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ ధర్నాకు వివిధ గ్రామాల నుంచి రైతులు తరలిరాగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ పంద్రజైవంతరావు, మాజీ వైస్ ఎంపీపీ సలీముద్దీన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పలువురు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం 2లక్షల రూపాయల రుణమున్న రైతులకు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తే మిగత అప్పును రైతులు చెల్లించుకుంటారని అన్నారు. అభివృద్ధి సంక్షేమం మరిచిన ప్రభుత్వం రుణాలు మాఫీ చేయాలని కోరితే రైతుల పై కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలు రాజ్‌గొండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురుకబాపరావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు రషీద్, సింగారే భరత్, కాటం రమేష్, దావుల రమేష్, భరత్‌చౌహాన్, కెరాజు, దరణి రాజేశ్, బాబాశ్యామ్,సిడాం సోనేరావు, ముజీబ్ ఖాన్,కరీంఖాన్,భీమ్‌రావు,మారుతి తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్, గాదిగూడ మండలాల్లో ధర్నా

నార్నూర్, ఆగస్టు22: సాధారణ ఎన్నికల్లో తెలంగాణ రైతాంగాన్నికి మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోనొ కొమురంభీం చౌరస్తా దగ్గర ధర్నా కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా గాదిగూడ మాజీ వైస్ ఎంపీపీ మర్సోనే యోగేశ్ మాట్లాడుతూ రేవంత్‌సర్కారు మెడలు వంచి ఎటువంటి ఆంక్షలేకుండా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని, రైతులందరికి రుణాలు, రైతు భరోసా ఇవ్వాలి ఇప్పటికీ అమాయక రైతులకు ప్రభుత్వ అధికారులు సరి అయిన సమాచారం ఇవ్వక బ్యాంకులు, కార్యాలయాల చుట్టు తిరగడం ఇబ్బందిగా ఉంది. ముఖ్యమంత్రి రైతులను మోసం చేస్తున్నారు. రైతుల మేలు కోరే వ్యక్తి దేశం ఒక్కడే ఉన్నాడు కేసీఆర్. కాంగ్రెస్ పార్టీని జనాలు నమ్మడం లేదు. రాబోయే రోజుల్లో పక్కాగా జనాలు వీరికి బుద్ధి చెప్తారు ఆయన అన్నారు.కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆడరాజు, మాజీ సర్పంచ్ కె.శ్యామ్ రావ్, జైవంత్‌రావ్, రావ్సాబ్, మాజీ ఎంపీటీసీ కనక ప్రభాకర్, రైతన్నలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.అదే విధంగా నార్నూర్ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు పక్షాన వార్షానికి సైతం లెక్క చేయకుండా ఆదిలాబాద్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్‌జనార్ధన్ రాథోడ్ ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నార్నూర్ మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంతు, ఆడేసురేష్, సర్పంచ్ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.



పరుపు లేని మంచంపై యువకుడికి చికిత్స



ఒకే మంచంపై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

వ్యాధుల విజృంభణతో
కిక్కిరిసిపోతున్న ఏరియా ఆసుపత్రి

● భైంసా ప్రభుత్వాసుపత్రిలో సరిపోని పడకలు ● సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న రోగులు

భైంసా, ఆగస్టు 22 : నిర్మల్ జిల్లా భైంసా డివిజన్ పరిధిలో సీజనల్ వ్యాధులు తీవ్రరూపం దాల్చాయి. అన్ని ప్రాంతాల్లో వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో డివిజన్ పరిధిలో రోగులు చికిత్సల కోసం అధికంగా భైంసా ఏరియా ఆసుపత్రికి వస్తున్నారు. దీంతో ఆసుపత్రి రాత్రి, పగలు తేడా లేకుండా చికిత్సల కోసం వచ్చిన రోగులతో కిక్కిరిసిపోయి కనిపిస్తోంది. ఇన్‌పెషెంట్, ఎమర్జెన్సీ వార్డులలో చేరుతున్న రోగులకు పడకలు సరిపోవడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక్కో పడకపై ఇద్దరు రోగులకు చికిత్సలు అందించాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. కొన్ని మంచాలపై పరుపులు లేకపోయిన రోగులు వాటిపై అలానే పడుకొని చికిత్సలు పొందుతున్నారు. అయితే మంచాలు కొన్ని తుప్పు పట్టి ఉన్నాయి. మరికొందరూ రోగులు బెంచీలపై కూర్చొని వైద్య సేవలు పొందుతున్నారు. మంచాలు సరిపోక రోగుల అవస్థలు అధికమవుతున్నాయి. వైద్యసేవలు సకాలంలో అందుతున్నప్పటికీ వసతులు సరిపోక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఏరియా ఆసుపత్రి నిర్వాహణాధికారులు పడకల సమస్యలను తీర్చేందుకు గాను ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రోగులు,వారి సంబంధీకులు ముక్త కంఠంతో కోరుతున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా పరిస్థితులను పరిగణలోకి తీసుకుని సౌకర్యాలు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి

తలమడుగు , ఆగస్టు 22 : తలమడుగు మండలంలోని కోసారి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి యువకుడు మృతి చెందాడని రైల్వే అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే తలమడుగు మండలం రుయ్యడి గ్రామానికి చెందిన మావురపు వెంకటేష్ (30) ఉదయం ఐదు గంటల ప్రాంతంలో నాందేడ్ నుంచి ఆదిలాబాద్‌కు కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైల్ వస్తున్న క్రమం కోసాయి రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జైనథ్, ఆగస్టు 22 :ఆదిలాబాద్ నియోజక వర్గంలోని ఆయా గ్రామాలలోగల ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పాయలఫౌండేషన్ చైర్మన్ పాయలశరత్ అన్నారు. గురువారం జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామంలోని రాంమందిర ఆవరణలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ వేసి భక్తులకు నీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులు,భక్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయర్ విజయ్, ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డిలతో పాటు దీపాయిగూడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు
అంద్ ఆదివాసీ సంఘం ఆహ్వానం

ఉట్నూర్, ఆగస్టు 22: ఈ నెల 29,30 తేదీలలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలో నిర్వహించే సద్గురు శ్రీ పూలాజిబాబా 100వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కని, రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి డా.ధనసరి అనసూయ,సీతక్కని రాష్ట్ర సచివాలయంలో గురువారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ఆహ్వానించారు.



రుణమాఫీ అయ్యేనా?

రూ.2లక్షలకు పైన రుణం తీసుకున్న రైతుల్లో ఆందోళన

- ఇంకా విధి విధానాలను ఖరారు చేయని ప్రభుత్వం
- మిగతా సొమ్మును కట్టాలంటూ ప్రకటనలు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా స్పష్టత కరువు
- ప్రస్తుతం అప్పు పుట్టడం లేదంటున్న రైతులు

ఆదిలాబాద్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రూ.2లక్షలకు పైబడి రుణం తీసుకున్న రైతులు కొంత ఆందోళనకు గురవుతున్నారు. అసలు తమకు రుణమాఫీ అవుతుందా.. కాదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన డెడ్‌లైన్ ఆగస్టు 15 ముగిసి పోయింది. అలాగే ఇప్పటికే మూడు విడతల్లో లక్ష నుంచి రూ.2లక్షల వరకు రుణం ఉన్న రైతులందరికీ రుణవిముక్తి చేస్తూ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మూడు విడతల్లో కలిపి జిల్లా వ్యాప్తంగా 55వేల 961 మంది రైతులకు గాను రూ.608.88 కోట్ల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాని పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగలేదంటూ రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను మొదలు పెట్టింది. మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తుంది. వివిధ కారణాలతో వందలాది మందికి రుణాలు వర్తించ లేదని అధికారులు చెబుతున్న ఎక్కువగా రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతులే ప్రత్యేక అధికారుల వద్దకు వస్తున్నారని తెలుస్తుంది. ఇప్పటికే రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతుల విషయమై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది.

సమాధానం చెప్పలేక పోతున్న అధికారులు

రూ.2లక్షలకు పైబడిన రుణాలపై ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయక పోవడంతో దీనిపై సంబంధిత అధికారులు సరైన సమాధానం చెప్పలేక పోతున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం నాల్గవ విడతను ఎప్పుడు ప్రకటిస్తుందోనని అన్నదాతల్లో ఆసక్తి కనిపిస్తోంది. మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించిన రూ.2లక్షల వరకు రుణమాఫీ కాని రైతుల నుంచే దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఆపై రుణం తీసుకున్న రైతుల సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో బ్యాంకు అధికారులను అడిగిన తమకేమి తెలియదంటూ దాటవేయడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

పొంతన లేని ప్రకటనలు

రూ.2లక్షలకు పైబడి రుణం తీసుకున్న వారంతా మిగతా సొమ్మును బ్యాంకుల్లో చెల్లించాలని ప్రకటనలు చేయడంతో రైతులు బ్యాంకు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక పోవడంతో అధికారులు మిగితా సొమ్మును తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. రుణమాఫీ జాబితాలో లేని రైతులకు మొత్తం రుణం చెల్లించాలంటూ అధికారులు సూచిస్తున్నారు. దీంతో రైతులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. అసలు కుటుంబంలో ఎవరికి రూ.2లక్షల రుణమాఫీ వర్తిస్తుంది, ఎవరు మిగితా సొమ్మును చెల్లించాలి అనే దానిపై స్పష్టత కనిపించడం లేదు. ఉదాహరణకు ఒక కుటుంబంలో భార్య భర్తలిద్దరికీ రూ.2లక్షలకు పైగానే రుణం ఉంది. అయితే వీరిద్దరిలో ప్రభుత్వం ఎవరికి రుణమాఫీ చేస్తుందో అర్థంకాని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మిగితా సొమ్మును చెల్లించడానికి రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఒకవేళ మిగితా సొమ్మును చెల్లించిన రుణమాఫీ జరుగుతుందో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగో విడతపై కాలయాపన

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాల్సి ఉంది. కాని రూ.2లక్షలకు పైబడి రుణాలు తీసుకున్న రైతుల విషయంలో కావాలనే కాలయాపన చేస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఇప్పటికే బ్యాంకుల నుంచి పంట రుణాలను తీసుకున్న రైతుల వివరాలను ప్రభుత్వం తీసుకుంది. దీంతో ఎవరు ఎంత రుణం తీసుకున్నారనే దానిపై ప్రభుత్వం వద్ద లెక్కలు ఉన్నాయి. రైతులు ఎంత రుణం తీసుకున్న కుటుంబంలో ఒకరికి రూ.2లక్షల వరకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తే సరిపోతుంది. కానీ రూ.2లక్షలకు పైబడి రు ణం తీసుకున్న సొమ్మును బ్యాంకులకు చెల్లించాలని ప్రభుత్వం తిరకాసు పెట్టడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తే మిగితా సొమ్మును రైతులు సర్దుబాటు, రెన్యూవల్ చేసుకోవడం లేదా మిగితా సొమ్మును చెల్లించడం జరుగుతుంది. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని బ్యాంకు అధికారులే చెబుతున్నారు. అలాగే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఎదురు చూస్తున్న రైతుల రుణాల రెన్యూవల్ గడువు కూడా ముగిసి పోయింది. దీంతో కాలయాపన జరిగితే అధిక వడ్డీలను చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువ రైతు పేరు అల్చెట్టి అనిల్. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామం. ఈ రైతుకు 5 ఎకరాల సాగుభూమి ఉంది. దీంతో తాంసి మండల ఎస్‌బీఐలో రూ.2లక్షల 70వేలను పంట రుణంగా తీసుకున్నాడు. కానీ ప్రభుత్వం మూడు విడతల కింద రూ.2లక్షల వరకు మాత్రమే రుణమాఫీ చేసింది. రూ.2లక్షలకు పైబడి రుణం తీసుకున్న రైతులు మిగతా సొమ్మును చెల్లించాలని ప్రకటనలు చేయడంతో రూ.70వేలను చెల్లించేందుకు బ్యాంకుకు వెళ్తే అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితులే జిల్లాలో చాలా మంది రైతులు ఎదుర్కొంటున్నారు.



మొక్కలు నాటుతున్న జడ్పీ సీఈవో

మొక్కలను సంరక్షించాలి

గుడిహత్నూర్, ఆగస్టు 22: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలనరి జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. మొక్కలను పెంచడం వల్ల మనిషికి కావాల్సిన ఆక్సిజన్ అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ హై, ఎంపీవో దిలిప్ కుమార్, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

అమ్మ పేరు మీద మొక్క నాటాలి..

ఇచ్చోడ: ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని జడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో పంచాయితీ రాజ్, గ్రామీణావృద్ధి శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఈవో సూర్యప్రకాష్, ఏపీవో నరేందర్‌గౌడ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



గురుకుల పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 22: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, వార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు నాలుగు రోజుల క్రితం ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, రాపిడ్ టెస్ట్, చికిత్స ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనల మేరకు అనుభవజ్ఞులైన వైద్యులచే సేవలు అందించి ఎప్పటికప్పుడు కేసుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. త్వరలో ఆస్పత్రులను తనిఖీ చేయడం జరిగిందని, దిశా నిర్దేశం చేసినప్పటికీ నిర్లక్ష్యం వహించిన గజానన్ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యాధికారికి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జ్వరాలు, డెంగ్యూ కేసుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడం, మెడిసిన్ స్టాక్ డిఫరెన్స్ రావడంపై అసహనం వ్యక్తం చేశారు. మెడిసిన్ సప్లై ఎక్కడి నుంచి వస్తుంది, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐసీయూ, ఓపీ తదితర చార్జీ లిస్ట్ ఏర్పాటు చేయకపోవడం, డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కోసం పరీక్ష (ఎలిసా) రిమ్స్‌లో మాత్రమే ఉందని తెలిపారు. ఈనెలలో ఎన్ని కేసులు వచ్చాయి రిఫర్ చేశారా అని అడగగా సరైన సమాధానం రాలేక పోవడంతో నోటీసులతోపాటు వారం రోజులు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ లోపు ఆస్పత్రిలో అన్ని రిజిస్టర్‌లు రికార్డులు సిద్ధంగా ఉంచాలని, మళ్లీ ఆస్పత్రిని తనిఖీ చేయడం జరుగుతుందని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి కె.కృష్ణ, నరేందర్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ..

మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాల అనుకుంటను గురువారం కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, స్టోర్ రూమ్, సిక్ రూమ్, డ్రైనేజీ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం ఈ రోజు చికెన్ ఉండడంతో ఎన్ని కేజీల చికెన్ తెచ్చారు. ఎంత మంది విద్యార్థులకు వంట చేశారని ప్రిన్సిపాల్ ఉమాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్ రూమ్, సిక్ రూమ్‌ను పరిశీలించారు. అలాగే పట్టణంలోని బాలాజీనగర్‌లో కలెక్టర్ పర్యటించి శుభ్రత పాటించాలని కలెక్టర్ అవగాహన కల్పించారు.

రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

- మాజీ మంత్రి జోగు రామన్న
- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ధర్నా



ఆదిలాబాద్‌లో ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న జోగు రామన్న



ధర్నాకు హాజరైన బీఆర్ఎస్ నేతలు, రైతులు



బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో

ఆదిలాబాద్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి) ఎన్నికలకు ముందు ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ నేతలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. ఇబ్బందుల పాలు చేస్తున్న కాంగ్రెస్ మిడతలను తరిమికొట్టే సత్తా రైతులకు మాత్రమే ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మిడతలు చొరబడి రైతుల రుణమాఫీని మింగేస్తున్నాయని విమర్శించారు. అర్హులైన అన్నదాతలందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కారణంగా జిల్లాలో వేలాది మంది రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజక వర్గంలోనే రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కావడం లేదని ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. రైతుభరోసా కింద ఇస్తామన్న రూ.15వేల ఆర్థిక సహాయంపై ప్రభుత్వం ఊసెత్తడం లేదన్నారు. రుణమాఫీకి రూ.41వేల కోట్లు అవసరమని నిర్ణయించిన తర్వాత బడ్జెట్‌లో కేవలం రూ.26వేల కోట్లను మాత్రమే కేటాయించారని, చివరకు రూ.17వేల కోట్లను మాఫీ చేయడం జరిగిందన్నారు. రైతులకు అండగా నిలబడి పోరాటం చేస్తే కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వానకాల సీజన్ గడిచి పోతున్నా రైతుబంధు సొమ్ము రావడం లేదని, రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హామీల అమలు చేతగాక పోతే రాజీనామా చేయాలి : ఎమ్మెల్యే

నేరడిగొండ: ఆరు గ్యారెంటీలు అమలు చేతగాక పోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం ఇచ్చోడలో నియోజకవర్గ రైతులతో చేపట్టే ధర్నాకు వెళ్తున్న సందర్భంగా మండల కేంద్రంలో గల తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండానే మాయమాటలు చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కారణంగా లక్షలాది మంది రైతులు ప్రతి రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో పది సంవత్సరాల కాలంలో 24గంటల పాటు కరెంట్, రైతుబంధుతో రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం ఇచ్చోడ ధర్నా కార్యక్రమానికి కార్యకర్తలతో కలిసి బయలుదేరి వెళ్లారు.ఆయన వెంట బోథ్, నేరడిగొండ తాజా మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్‌సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ పండరి, నాయకులు సురేందర్‌యాదవ్, ఏలేటి రవీందర్‌రెడ్డి, జాదవ్‌గణేష్, పెంట వెంకటరమణ, దేవేందర్‌రెడ్డి, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలి

సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : ఎంపీ

తలమడుగు, ఆగస్టు 22: ఆధ్యాత్మిక మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎంపీ నగేష్ కోరారు. గురువారం మండలంలోని అర్లి (కె) గ్రామంలో శ్రావణ మాసంలో నిర్వహిస్తున్న శబరి మాత ఉత్సవ సమితి అఖండ జ్యోతిని ఎంపీ గోడం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆధ్యాత్మిక మార్గంతో మానసిక ప్రశాంతతో పాటు ఉల్లాసం ఆరోగ్యంగా ఉంటారన్నారు. భక్తి భావనతో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందని సూచించారు. అనంతరం ప్రత్యేక భజన, హారతి, అన్నదానం, బరంపూర్ గ్రామం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎంపీని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోండ్ల వెంకట స్వామి, కనపర్తి చంద్రకాంత్, నారాయణరెడ్డి, భుజంగరావు, జక్కుల ప్రభాకర్, సురేందర్, శ్రీనివాస్, బరకం మల్లేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి పల్లకీ ఊరేగింపు



మంగళ హారతులతో సాయి పల్లకిని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తలమడుగు, ఆగస్టు 22: మండల కేంద్రంలో గురువారం సాయి దీక్షపరుల, భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా సాయి పల్లికి ఊరేగింపు నిర్వహించారు. కదిలింది శ్రీసాయి పల్లకి నామస్మరణతో బాజా భజంత్రీలతో మంగళహారతులతో గ్రామంలోని పలు వీధుల గుండా శోభాయామానంగా సాయి పల్లకిని ఊరేగింపు నిర్వహించారు. తలమడుగు గ్రామంలో గల భక్తులు 27 ఏళ్ల నుంచి ప్రతి సంవత్సరం సాయి మాల దీక్ష చేపట్టి 21రోజులు సాయిని స్మరిస్తూ మహారాష్ట్రలోని షిరిడి పుణ్య క్షేత్రానికి వెళ్లి దీక్ష విరమణ కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, సాయి దీక్ష పరులు వెంకటేశ్వర స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి



డొల్లారలో మురికి నీటిని పరిశీలిస్తున్న డీఐవో శ్రీనివాస్

జైనథ్, ఆగస్టు 22: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుత వర్షకాలంలో తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని డొలర గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి వర్షపు నీరు నిల్వ ఉన్న వాటిని తొలగించం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు మాత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సూచల, సీహెచ్‌వో డాక్టర్ ఈశ్వర్, హెచ్‌ఈవో రామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ అనిత, ఏఎన్ఎం సునంద ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోథ్, ఆగస్టు 22: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సోనాల ఆసుపత్రి వైద్యులు నవీన్‌రెడ్డి కోరారు. గురువారం మం డలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మలేరియా రాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, సూపర్ వైజర్ కవిత, ఏఎన్ఎం సవిత, హెల్త్ సూపర్ వైజర్ గోవర్ధన్ గురుకుల పాఠశాల హెచ్ఎస్ ప్రేమలు పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం